క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ

గిద్దలూరు రూరల్: హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ బేస్తవారిపేట వారి ఆధ్వర్యంలో స్థానిక సంజీవని వృద్ధాశ్రమానికి ఆదివారం గ్యాస్ సిలిండర్, బియ్యం, నిత్యావసర వస్తువులు, శాలువాలు, పండ్లు, భోజనాలు పంపిణీ చేశారు. ఆకలితో ఉన్నవారికి, అనాథలకు తమ వంతు సాయం అందించడం సొసైటీ లక్ష్యమని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాయుడు, రాజు, బి.పుష్పలత, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షునిగా దత్తాచారి

గిద్దలూరు రూరల్: స్థానిక రామాలయంలో ఆదివారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణుల సంఘ సమావేశంలో దత్తాచారిని సంఘ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తన శాయశక్తుల మేరకు కృషి చేస్తానని, సమస్యల పరిష్కారం కోసం పోరాడతానని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

శ్రీనివాస ప్రసాద్‌కు ఆసియా ఐకానిక్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస ప్రసాద్

కంభం: పట్టణానికి చెందిన సమాజ సేవకుడు పులి శ్రీనివాస ప్రసాద్ ఆదివారం ఆసియా ఐకానిక్ అవార్డు అందుకున్నారు. 33 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆదివారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ పీస్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ వారు అవార్డు అందజేశారు. అవార్డు గ్రహీతను పలువురు అభినందించారు.

ఆటోవాలాలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు



ఆటో యజమానికి స్టిక్కర్ అందజేస్తున్న ఎస్సై కోటయ్య

యర్రగొండపాలెం: ఆటోల యజమానుల పూర్తి వివరాలు తెలిపే క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఆదివారం ఎస్సై జి.కోటయ్య పంపిణీ చేశారు. టుడే సేఫ్ జర్నీ సంస్థ ఆధ్వర్యంలో ఆటోకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిపే డిజిటల్ స్టిక్కర్లను ఆటోలకు ఏర్పాటు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఆటోల యజమానులు తమ పూర్తి వివరాలు తెలియజేసి రేడియం స్టిక్కర్లు పొందాలని స్పష్టం చేశారు. క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు లేకుండా నడిపే ఆటోల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామపూజలు, కుంకుమపూజలు, అఖండహారతి నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా



గిద్దలూరు రూరల్: నంద్యాల–గిద్దలూరు ఘాట్ రోడ్డులో ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు బోల్తాపడిన వాహనాన్ని తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు మీరే!

● ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి

మార్కాపురం టౌన్: ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు మీరేనని, ప్రతి గృహానికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబం పొందిన లబ్ధిని తెలపాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని డ్వాక్రా బజారులో 1 నుంచి 17 వార్డుల్లోని గృహసారథులు, వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్‌ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమల్లో వలంటీర్ల, కన్వీనర్‌లతో కలిసి గృహసారథులు ప్రతి గృహాన్ని సందర్శించి అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు అమలయ్యేలా చూడటంతో పాటు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల అమల్లో 99 శాతం హామీలు నేరవేర్చారు కనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లుగా రాష్ట్రంలో 175 స్థానాలు గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి

మెడికల్ కాలేజీ వరం

మార్కాపురంలో మెడికల్ కాలేజీ వరం అని ఎమ్మెల్యే కేపీ అన్నారు. అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. మహిళ వలంటీర్లు 50 శాతం మంది ఉన్నారని ఇంటింటికీ ప్రతి మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆ ఇంట్లో ప్రభుత్వం వల్ల వచ్చినా లబ్ధిని తెలపాలన్నారు. అబ్జర్వర్ హబీబుల్లా, చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కొత్త కృష్ణ, సిరాజ్, హర్షిత బాబీ, షేక్షావలి, కె.దుర్గ, సుష్మిత కుమారి, అమీరుల్లాఖాన్, ఎం.శ్రీనివాసులు, గుంటక వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఐడియా.. అదిరింది!



మోటార్ సైకిల్‌కు ఏర్పాటు చేసిన బండితో వెళుతూ..



జామ పండ్లు అమ్మకాలు చేస్తున్న రైతు పిచ్చిరెడ్డి

కొనకనమిట్ల: పల్లెల్లో కూరగాయలు, రకరకాల పండ్లు అమ్మడం సహజం.. కానీ కొనకమనిట్ల మండలంలో హాయ్‌రే హాయ్.. జామ్ పండురోయ్..అంటూ తన మోటార్ సైకిల్‌కు నాలుగు చక్రాల బండిని అమర్చుకున్నాడు ఓ రైతు.. తన పొలంలో పండించిన తాజా జామ పండ్లను మార్కెట్‌కు తరలించకుండా నేరుగా పల్లెలకు వెళ్లి అమ్మకాలు చేస్తున్నాడు. కొనకనమిట్ల మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డి పిచ్చిరెడ్డి తన పొలంలో కొంత భాగం జామతోటతో పాటు కూరగాయలు సాగు చేశాడు. మోటార్ సైకిల్ ముందు భాగంలో ఆడియో మైక్ ఏర్పాటు చేసుకొని దాని ద్వారా ప్రచారం చేస్తున్నాడు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీ గణపతి, సుదర్శన, నవగ్రహ హోమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గణపతి పూజ, మండపారాధన, పూర్ణాహుతి, అర్చన మహా నివేదన అనుష్టా హోమం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు వసంతోత్సవం నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. వేదపండితులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీవారికి పట్టు వస్త్రాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, వాగుమడుగు ఎంపీటీసీ చెన్నెబోయిన కృష్ణవేణి, కోటయ్య దంపతులు, పాతకోట శ్రీనివాసులరెడ్డి దంపతులు సమర్పించారు.



అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు



అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

గుంటి గంగా భవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయానికి రూ. 9,266 ఆదాయం వచ్చినట్లు ఆర్‌పి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తర్లుపాడు: మండలంలో వెలిసిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 15 వరకు జరగనున్నట్లు ఈవో చెన్నకేశవ రెడ్డి, అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కర రావు ఆదివారం తెలిపారు. నేడు ధ్వజారోహణ, అంకురార్పణం, 7న కళ్యాణోత్సవం, రాత్రి హంస వాహనం, 8 సింహ, 9న శేష, 10న హనుమంత, 11న గరుడ, 12 గజ, 13న రథోత్సవం నిర్వహించనున్నారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



హోమం నిర్వహిస్తున్న ఎంపీటీసీ దంపతులు

జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షం



వేముల ప్రభపై మాట్లాడుతున్న మద్దిశెట్టి రవీంద్ర, సుంకర బ్రహ్మారెడ్డి

ముండ్లమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని ఎమ్మెల్యే సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి తెలిపారు. వేములలో శనివారం రాత్రి కొండగురునాథ స్వామి తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మద్దిశెట్టి యూత్ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగుతోందన్నారు. ఇచ్చిన మాట కోసం ఎమ్మెల్యే మద్దిశెట్టి ఎంతవరకైనా వెళ్తారనడానికి సుంకర సునీతను ఎంపీపీగా చేయడమే నిదర్శనమన్నారు. స్వగ్రామం కాకపోయినప్పటికీ తమను ఆదరించి ఎంపీటీసీగా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చి మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మద్దిశెట్టి రవీంద్ర, సుంకర బ్రహ్మారెడ్డి, తాళ్లూరు, ముండ్లమూరు జెడ్పీటీసీలు మారం వెంకటరెడ్డి, తాతపూడి రత్నరాజులను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి వెంటేశ్వర రెడ్డి, పాలెపోగు డగ్లస్, గోపనబోయిన ఫిలిప్ రాజు, సర్పంచ్‌లు జనమాల నాగేంద్రం పిచ్చయ్య, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బూచేపల్లి పరామర్శ



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన పిచ్చాల నారాయణరెడ్డి, గొంగటి నాగ సురేష్ రెడ్డి కుటుంబాలను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదివారం పరామర్శించారు. విహారయాత్రలకు వెళ్లి విషాదం చోటుచేసుకోవటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెన్నపూస బాపిరెడ్డి, మాజీ వార్డు మెంబరు కర్నా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిరాన్ని సందర్శించిన టీటీడీ చైర్మన్ వైవీ



ఇస్కాన్ కార్యక్రమాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఇస్కాన్ మందిరాన్ని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సందర్శించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇస్కాన్ ఆధ్వర్యంలో 2 లక్షల మంది యాత్రికులు, శివమాలధారులకు భోజన వసతి కల్పించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి నిమయ్‌దాస్ వివరించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ కార్యక్రమాల క్యాలెండర్‌ను వైవీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్ బోర్డు సభ్యురాలు చెప్పల్లి కనకదుర్గ, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న దృశ్యం

త్రిపురాంతకం: స్థానిక షిరిడీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

ఆవులకు దాణా పంపిణీ

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లె గ్రామంలో సద్గురు యోగానంద నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో గోశాలకు 200 కేజీల దాణా, అరటికాయలు మార్కాపురం పట్టణానికి చెందిన దాత జక్కా రవి, కిశోర్ ఆదివారం అందజేశారు. ఆవులకు పూజలు చేసిన అనంతరం దాణా పెట్టారు. త్వరలో ట్రాక్టర్ వరిగడ్డిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తేనీటి విందుకు హాజరైన వైవీ, మంత్రి సురేష్



ఎమ్మెల్యే కేపీ నివాసంలో పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి సురేష్

మార్కాపురం: ఎమ్మెల్యే కేపి నాగార్జునరెడ్డి నివాసానికి ఆదివారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వచ్చి కొండారెడ్డి యోగక్షేమాలు అడిగి టీ సేవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లను పరిచయం చేశారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డిని, మంత్రి సురేష్‌ను ఎమ్మెల్యే కేపీతో పాటు పలువురు ఘనంగా సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీ బేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణ, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఎంపీపీలు అరుణ చెంచిరెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్‌లు మేడా భద్రి, ఎస్.కొండయ్య, ఈవో శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ పి.కేశవరావు, శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు మెంబర్ డాక్టర్ కనకదుర్గ, పలువురు కౌన్సిలర్‌లు సన్మానించారు. అనంతరం స్థానిక లాడ్జిలో వైవీ సుబ్బారెడ్డిని జిల్లా పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనమారెడ్డి కలిసి సన్మానించారు.



వైవీని కలిసిన జంకె, వెన్నా

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు

దొనకొండ: సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు, మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి మద్దతుగా సీఐటీయూ కార్యకర్తలు దొనకొండలో ఆదివారం ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. జిల్లాలో అనేక చోట్ల ఉపాధ్యాయుడిగా పని చేసి గుర్తింపు తెచ్చుకున్నారని, యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

మార్కాపురం టౌన్: పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభా స్కాలర్‌షిప్‌ల కోసం పరీక్షను నిర్వహించారు. మొత్తం 1581 మందికి గాను 1503 మంది హాజరైనట్లు ఎంఈవో రాందాస్‌నాయక్ తెలిపారు. 78 మంది హాజరైనట్లు తెలిపారు. జెడ్పీ బాలుర, బాలికోన్నత, మున్సిపల్, పీఎస్‌కాలనీ, సాయిబాలాజీ, రాయవరం గురుకుల, కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు పరీక్ష రాశారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎం.చంద్రశేఖరరెడ్డి, శ్రీదేవి, వెంకటేశ్వరరెడ్డి, వై.శ్రీనివాసులు, ఎస్.నాగేశ్వరరావు, రత్నశంకర్‌నాయక్, కాశింసాహెబ్‌లు వ్యవహరించారు.



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

ఏపీ రెడ్డి సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా భీమి రెడ్డి

తాళ్లూరు: ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తూర్పుగంగవరానికి చెందిన భీమిరెడ్డి నాగమల్లేశ్వర రెడ్డి నియమితులయ్యారు. జిల్లాలో ఇప్పటికే భీమిరెడ్డి సంఘ జిల్లా యూత్ అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. గుంటూరులో జరిగిన సమావేశంలో ఈమేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీఆర్ఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి శివా రెడ్డి, ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్ రెడ్డి, ఏపీఆర్ఎస్ అధికార ప్రతినిధి బత్తుల బత్తుల బాలి రెడ్డి, ఉపాధ్యక్షుడు పురిణి శ్రీనివాస రెడ్డి, మహిళా నాయకులు సుశీల రెడ్డి, శ్రీ రెడ్డి పాల్గొన్నారు.



భీమి రెడ్డిని సన్మానిస్తున్న సంఘ బాధ్యులు

భక్తిశ్రద్ధలతో ఉరుసు ఉత్సవాలు

మార్కాపురం: మండలంలోని రాయవరంలో శని, ఆదివారాల్లో ఉరుసు ఉత్సవాలను (జెండా పండుగ)ఘనంగా నిర్వహించారు. కుల, మత, వర్గాలకు అతీతంగా గ్రామస్తులంతా ఐక్యంగా పండగను జరుపుకున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక్కో జెండాను చేతపట్టుకుని ఊరేగింపులో పాల్గొనటం ఆనవాయితీగా వస్తోంది. జెండా చెట్టును సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు.



గ్రామంలో జెండాల ఊరేగింపు

నేడు సమీక్ష సమావేశం

కొనకనమిట్ల: మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని గృహసారథులకు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లకు సోమవారం స్థానిక కల్యాణ మండపంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, నాయకులు ఉడుముల గురవారెడ్డి, చలమారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అంతా హాజరు కావాలని మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి కోరారు.